24072024-DIS-08_Layout 1 7/24/2024 3:23 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# ఐఏఎస్‌పై నీలినీడలు

**ప్రభుత్వానికి,** ప్రజలకు మధ్య వారధి లాంటి అధికార యంత్రాంగానికి శిఖరాయమానమైన ఐఏఎస్ వ్యవస్థ ప్రస్తుతం వివాదాల్లో నలుగుతున్నది. ఓ కుర్ర ఐఏఎస్ నిర్వాకం ఇందుకు కారణం. పుణేలో ట్రైనీ ఐఏఎస్‌గా నియమితురాలైన పూజా ఖేడ్కర్ తనకు కావాల్సిన సౌకర్యాల గురించి హంగామా చేయడం, పూర్తిగా పదవిలోకి రాకముందే అధికార దుర్వినియోగానికి పాల్పడటం వార్తలకెక్కింది. అప్పుడే అడుగులు వేయడం నేర్చుకుంటున్న అధికారికే ఇంత డాబూదర్పం ఉంటే సీనియర్ల వైభవం ఎలా ఉంటుందోననే దిశగా ఆలోచనలు మళ్లాయి. ఈ లోగా ఓ సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం కింద తీగ లాగితే డొంకంతా కదిలింది. సదరు ట్రైనీ ఐఏఎస్ దివ్యాంగుల కోటాను ఉపయోగించుకున్నట్టు వెల్లడైంది. కానీ, ఆమె వైకల్యం బూటకమని తేలింది. అంతేకాకుండా ఓబీసీ కోటా కూడా ఉపయోగించుకున్నదనీ, అందుకు క్రీమీలేయర్ నిబంధన కింద కుటుంబ ఆదాయం చాలా తక్కువగా చూపిందనే సంగతీ వెలుగులోకి వచ్చింది. నిజానికి ఆమె కుటుంబానికి కోట్లలో ఆస్తులున్నాయి. తండ్రి మాజీ ఐఏఎస్ అధికారి. తన వైకల్యానికి సంబంధించి పూజ నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిందనే సంగతి కూడా వెలుగులోకి వచ్చింది. పూజ వ్యవహారం బయటకు వచ్చింది కనుక మాట్లాడుకుంటున్నాం కానీ, బయటకు రానివి ఎన్ని ఉంటాయో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐఏఎస్ ఆశావహుల్లో ఈ వ్యవహారం తీవ్ర అసంతృప్తిని రాజేసింది.

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో జరిగే ఐఏఎస్ ఎంపిక పరీక్ష అనేది చాలా గుట్టుగా ఉంటుందని, అభ్యర్థి నేపథ్యాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తారని జనం చెప్పుకొంటారు. అలాంటప్పుడు తప్పుడు సమాచారం ఇచ్చి, నకిలీ సర్టిఫికెట్లు పెట్టి ఐఏఎస్ కావడం ఎలా సాధ్యమైంది? ఉన్నతస్థాయి అధికారుల ఎంపికలో ఈ తరహా లొసుగులు ఎలా చొరబడ్డాయి? వ్యవస్థలోని కుళ్లు బజారుకెక్కిన తర్వాత యూపీఎస్సీ ఆలస్యంగా మేలుకుని పూజపై వేటు వేయడమే కాకుండా ఆమెపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయించింది. ఈ నేపథ్యంలో యూపీఎస్సీ చైర్మన్ మరో ఐదేండ్ల పదవీకాలం ఉండగానే అర్ధాంతరంగా రాజీనామా చేసి వెళ్లిపోవడం ఎవరికీ ఆశ్చర్యాన్ని కలిగించలేదు. ఈ కేసులో తదుపరి ఏం జరుగుతుందనేది అప్రస్తుతం. పూజ వివాదం ఫలితంగా ఐఏఎస్ అనే హోదాకుండే గౌరవం మసకబారింది.

'ఎంతో గొప్పగా ఊహించుకునే ఐఏఎస్ ఎంపిక విధానం ఇంతగా దిగజారిపోయిందా?' అని దేశ ప్రజలు విస్తుపోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇదంతా గమనిస్తే యూపీఎస్సీ ఎంపిక విధానం లోపభూయిష్టంగా, అవినీతిమయంగా మారిందనే భావనలు సహజంగానే పొడసూపాయి. దేశ పరిపాలనా వ్యవస్థకు గుండెకాయ లాంటి ఐఏఎస్ విషయంలో ఇది ఏ మాత్రం క్షమార్హం కాదు. పూజ లాంటివాళ్లు అక్రమంగా ఐఏఎస్‌లోకి దూరేందుకు సహాయపడిన లొసుగులను తక్షణమే సవరించాలి. పూజతో పాటు ఆమెకు సాయపడినవారిపైనా చర్యలు తీసుకోవాలి. ఆమూలాగ్రం కుళ్లి కంపు కొడుతున్న వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయడం ఒక్కటే మార్గం. అన్ని స్థాయిల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రవేశపెట్టడం ద్వారానే అది సాధ్యమవుతుంది.

## మరో 26 రాష్ట్రాలూ ఉన్నాయి!

*కేంద్ర బడ్జెట్‌లో ఏపీ, బీహార్ రాష్ట్ర ప్రజలకు మాత్రమే ఎంతో కొంత ఇచ్చారు. వాళ్లను సంతృప్తి పరచడానికి రాజకీయ కారణాలు ఉండవచ్చు. కానీ, దేశంలో మరో 26 రాష్ట్రాలు కూడా ఉన్నాయి. ఆ రాష్ట్రాల ప్రజలు సంతోషించడానికి ఈ బడ్జెట్‌లో ఏ అంశమూ కనిపించడం లేదు.*

**- శశిథరూర్,** కాంగ్రెస్ ఎంపీ

# భుజం తట్టి నడిపించే నేస్తం



**రాజేష్ నాయక్.జి**
96035 79115

**నాయకత్వం కోసం చాలామంది ఆరాటపడుతుంటారు, తాపత్రయ పడుతుంటారు, ఆశ పడుతుంటారు. అయితే నాయకత్వంపై ఆశ ఉన్నంత మాత్రాన నాయకుడు కాలేరు. 'పుట్టుకతో ఎవరూ నాయకుడు కాలేరు, నాయకుడు తయారవుతాడు' అని ప్రముఖ ఫుట్‌బాల్ కోచ్ విన్సి లంబార్డి ఎప్పుడో చెప్పారు. లీడర్ అంటే ఇన్‌స్పిరేషన్, లీడర్ అంటే మోటివేషన్. లీడర్ అంటే విజన్. ఈ లక్షణాలన్నీ కలగలిసినవాడే అసలుసిసలు లీడర్. అలాంటి నాయకత్వ లక్షణాలను పుట్టుకతోనే పుణికిపుచ్చుకున్న యువ తేజం కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్).**


నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు తెలంగాణలో ఎన్నో ఉద్యమాలు జరిగాయి. అయినా అంతిమ లక్ష్యాన్ని ఎవరూ ముద్దాడలేకపోయారు. ఆ తర్వాత మలిదశ తెలంగాణ ఉద్యమ బాధ్యతలను కేసీఆర్ తన భుజాన వేసుకున్నారు. పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు 2004 నుంచి ఆయనకు తోడయ్యారు కేటీఆర్. కేసీఆర్ కుమారుడిగా కాకుండా ఒక సాధారణ కార్యకర్తలా ప్రత్యక్ష ఉద్యమంలో అడుగుపెట్టారు. ఎందరో యువ విద్యార్థి నాయకులను భుజం తట్టి ముందుకు నడిపి రామన్నగా పేరొందారు. కేసీఆర్ అనే మూడక్షరాలు దేశంలో ఎంత పాపులరో.. కేటీఆర్ అనే మూడక్షరాలు అంతే పాపులర్.

దూరదృష్టితో పనిచేసే వాళ్లు, మార్పు కోసం పరితపించేవాళ్లు చాలా తక్కువ మంది ఉంటారు. ఆ కోవలో ముందుండేది కేటీఆర్ మాత్రమే. ఆయన వ్యక్తిత్వం, పనిచేసే విధానం, నిర్ణయాలు తీసుకోవడంలో ఉండే వేగం ముందు ఎవరూ సాటిరారు. ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణలోని యువ నాయకులకు స్ఫూర్తి కేటీఆర్. తన నైపుణ్యాన్ని సానపెట్టుకొని, శక్తియుక్తులను ఉపయోగించుకొని, బలహీనతలను అధిగమించి, వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకొని నాయకుడిగా ఎదిగారాయన. అంతేతప్ప తండ్రి పేరు చెప్పుకొని కాదు. కేటీఆర్‌లో ఉన్నటువంటి బహుముఖ వ్యక్తిత్వం ఏమిటంటే.. నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారం కోసం తన జీవితాన్నే ప్రజా పోరాటంగా మలుచుకోవడం. కేటీఆర్ ఆలోచనలు వైవిధ్యం. ఆచరణ వినూత్నం. టెక్నాలజీ మీద ఆయనకున్న పరిజ్ఞానం అచంచలమైనది. తెలంగాణ అభివృద్ధి కోసం ఆయన వేసిన అడుగులు విప్లవాత్మకం. వెరసి చూస్తే రాజకీయాల్లో ఆయనొక అపర చాణక్యుడు. ఎన్నో జయాపజయాలు చూసినా సడలని సంకల్పం ఆయనది. సేవాతత్పరతకు నిలువెత్తు నిదర్శనం కేటీఆర్. ఒక్కమాటలో చెప్పాలంటే.. మాస్‌కి మాస్.. క్లాస్‌కి క్లాస్.

కేటీఆర్ తన తండ్రి వారసత్వాన్ని అడ్డుపెట్టుకొని వచ్చిన నాయకుడు కాదు. ఉన్నత చదువులు చదివి, పెద్ద ఉద్యోగాన్ని, అమెరికా జీవితాన్ని వదులుకొని ప్రజల కోసం పనిచేయాలనే ఆకాంక్షతో తెలంగాణ ఉద్యమంలో సాధారణ కార్యకర్తగా ఆయన అడుగుపెట్టారు. అనేక ఉద్యమాలకు ఊపిరై, అగ్గిబావుటాగా ఎగిసిన పోరుకెరటం కేటీఆర్. తెలంగాణ సమస్యలను సమగ్రంగా తెలుసుకున్న ఆయన వాటి పరిష్కారం కోసం తనకున్న పరిపూర్ణమైన ఆలోచనా విధానాలతో అనతికాలంలోనే ప్రజలకు చేరువయ్యారు. ఆప్యాయత, అనురాగాలతో పాటు స్పందించే మంచి మనసున్న మారాజుగా ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. తెలంగాణ ఏర్పాటయ్యాక ప్రజల ఆశీస్సులతో మొదటి మంత్రివర్గంలో పట్టణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అనతికాలంలోనే ఐటీ రంగంలో పేరుప్రఖ్యాతులు సంపాదించారు. ఐటీ దిగ్గజాలు, ప్రముఖ సంస్థల నుంచి మన్ననలు పొందారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేలా కృషి చేశారు. లక్షల మంది తెలంగాణ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించారు. తద్వారా అనేక దేశాలకు దిక్సూచిగా మారారు. ఆయన అకుంఠిత దీక్షను చూసి ఐటీ దిగ్గజాలు మంత్రముగ్ధులయ్యారు. ఆయనతో కలిసి పని చేసేందుకు ముందుకువచ్చారు. ఇది కేటీఆర్ పనితనానికి నిలువెత్తు నిదర్శనం.



## ఐటీ విధాత.. అభివృద్ధి ప్రదాత కేటీఆర్ బర్త్‌డే నేడు



హైదరాబాద్ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పాలనే లక్ష్యంతో ఐటీ శాఖ మంత్రిగా ఆయన అహర్నిశలు శ్రమించారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వంలో డైనమిక్ లీడర్‌గానే కాదు, పార్టీలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును పొందారు. ప్రజల మన్ననలు పొంది రామన్నగా పేరుగాంచారు. యువ నాయకుడిగా మొదలైన ఆయన ప్రస్థానం సబ్బండ వర్గాల దీవెనలతో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వరకు సాగింది. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన క్రమశిక్షణ కలిగిన 60 లక్షల మందికి పైగా కార్యకర్తలను గులాబీ సైన్యంలో చేర్పించారు. నవతరం నాయకుడిగా పారిశ్రామికవేత్తలు, మీడియా, సెలబ్రెటీలు, వివిధ పార్టీ నాయకుల మన్ననలు పొందుతూ తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు.

ఈ ప్రాంత అభివృద్ధి కాంక్షించే నాయకుల్లో అరుదైన నాయకుడు కేటీఆర్. రాజకీయాల్లో ముక్కుసూటిగా వ్యవహరించే గుణం, వినూత్నమైన ఆలోచనలు ఆయన సొంతం. ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడంలో, వాటికి పరిష్కార మార్గం చూపడంలో ఆయనకు ఆయనే సాటి. హైదరాబాద్ కీర్తిని ప్రపంచవ్యాప్తం చేయడంలో ఆయన కృషి అనిర్వచనీయం. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, క్వాల్కమ్, ఫాక్స్‌కాన్ తదితర ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థలు హైదరాబాద్‌కు రావడం వెనుక కేటీఆర్ కృషి ఎంతగానో ఉన్నది. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ఆయన చేసిన సేవలను గతంలో ఐటీ దిగ్గజాలు, పలువురు ప్రముఖులు కొనియాడారు.

ఈ ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకుడు కేటీఆర్. ఆపదలో ఉంటే ఆదుకునే గుణం, పార్టీ నాయకులకు నిత్యం అందుబాటులో ఉండే నాయకుడాయన. ఇలాంటి వర్సటైల్ లక్షణాలు ఉన్న కేటీఆర్‌కు బర్త్‌డే శుభాకాంక్షలు.

### టీ హబ్ అత్యుత్తమమైనది

టీ హబ్ అనేది తెలంగాణ రాష్ట్ర నూతన పారిశ్రామిక విధానం. నేను ఎక్కడా ఇటువంటి దాని గురించి వినలేదు. ఇది అత్యుత్తమమైనది.

– రతన్ టాటా,
టాటా గ్రూప్స్ మాజీ చైర్మన్

### నిజమైన జెంటిల్‌మెన్

కేటీఆర్ నిజమైన జెంటిల్‌మెన్. ఎక్కడ విజయం సాధించాలో, ఎక్కడ రాజీపడాలో ఆయనకు బాగా తెలుసు.

– సీపీ గుర్నాణి,
టెక్ మహీంద్రా మాజీ సీఈవో

### కేటీఆర్ కృషి వల్లే..

హైదరాబాద్‌లోని టీ హబ్‌లో చేరినందుకు ఆనందంతో పొంగిపోయాను. నేను ఇక్కడ తిరుగుతున్నప్పుడు టీ హబ్ అంటే ట్యాంక్‌బండ్ వద్ద టీ కార్నర్ అని ఉండేది. కానీ, ప్రస్తుతం తెలంగాణ అభివృద్ధి పట్ల ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చొరవ చూపడం వల్లే టీ హబ్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది.

– సత్య నాదెళ్ల, మైక్రోసాఫ్ట్ సీఈవో

### బ్రాండ్ అంబాసిడర్

కేటీఆర్ మంత్రిగానే కాకుండా తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా పనిచేస్తున్నారు. నిత్యం 24 గంటలూ తెలంగాణ అభివృద్ధి గురించి ఆయన ఆలోచిస్తారు. కేటీఆర్ చేసిన నాలుగేండ్ల నిరంతర ప్రయత్నాల ఫలితంగానే మనం ఇప్పుడు హైదరాబాద్‌లో అమెజాన్‌ను చూస్తున్నాం.

– జెఫ్ బెజోస్, అమెజాన్ ఫౌండర్

### కేటీఆర్ లాంటి నేతలు అవసరం

అరుదైన నాయకత్వ లక్షణాలు, అసాధారణ సంభాషణ నైపుణ్యం, రాజకీయ చతురతతో అనతికాలంలోనే పరిణతి చెందిన యువ నాయకుడు కేటీఆర్. తండ్రికి తగ్గ తనయుడు, చైతన్యశీలుడు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఆయన చూపే చొరవ మానవతా దృక్పథానికి నిదర్శనం. కార్యకుశలతలో కేటీఆర్‌కు సాటి రాగల యువనాయకులు లేరనడంలో అతిశయోక్తి లేదు. దేశానికి కేటీఆర్ లాంటి నవతరం నాయకులు అవసరం.

– రామోజీరావు, రామోజీ గ్రూప్స్ వ్యవస్థాపకుడు

### ఏకైక మంత్రి కేటీఆర్..

ప్రజా సేవలను మెరుగుపరచడానికి తెలంగాణ అత్యాధునిక ఐటీ కార్యక్రమాలను అమలు చేస్తూనే ఉంది. కేటీఆర్ తన అచంచలమైన దూరదృష్టితో 2020 స్కోచ్ ర్యాంకింగ్‌లో ఎగబాకారు. అంతకుముందు 2016లోనూ స్కోచ్ ర్యాంకింగ్‌లో అత్యుత్తమ పనితీరు కనబరిచి దేశంలోనే నెంబర్.1 మంత్రిగా ఎంపికయ్యారు. తద్వారా రెండుసార్లు స్కోచ్ అవార్డు పొందిన ఏకైక రాష్ట్ర మంత్రిగా కేటీఆర్ నిలిచారు.

– సమీర్ కొచ్చర్, స్కోచ్ గ్రూప్ చైర్మన్

లేఖ

## ఇదేనా టీమ్ ఇండియా?


**మనది** సమాఖ్య దేశం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకదానికొకటి సహకరించుకుంటూ దేశాభివృద్ధికి బాటలు వేయాలి. అప్పుడే దేశం, దేశంలోని ప్రజలు బాగుపడతారు. కానీ, కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఓవైపు 'టీమ్ ఇండియా' అని అంటూనే మరోవైపు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ అందుకు తాజా ఉదాహరణ. బీజేపీ సర్కార్ మాటలకు, చేతలకు పొంతనే ఉండటం లేదని చెప్పడానికి పద్దులో కేటాయింపులే నిదర్శనం.

తాజా కేంద్ర బడ్జెట్ కూడా గత బడ్జెట్‌లనే పోలి ఉంది. కాకపోతే ఇందులో భిన్నమైన విషయం ఒకటున్నది. ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తున్న నితీశ్‌కుమార్, చంద్రబాబు పాలిస్తున్న బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు మోదీ సర్కార్ ఎక్కువ కేటాయింపులు చేసింది. బీహార్‌కు, ఏపీకి వరాల జల్లులు కురిపించింది. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లను కేటాయించింది. అంతేకాదు, పోలవరం నిర్మాణం సహా అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు నిధుల వరద పారించింది. అదేవిధంగా బీహార్ రాష్ట్రానికి ఏకంగా రూ.26 వేల కోట్లకు పైగా ప్రత్యేక నిధులను కేటాయించింది. అయితే ఆయా రాష్ట్రాలకు ప్రత్యేక నిధుల కేటాయింపును ఎవరూ తప్పుబట్టరు. కానీ, దేశమంటే ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలు మాత్రమే కాదు కదా. వాటితో పాటు దేశంలో మరో 26 రాష్ట్రాలు కూడా ఉన్నాయనే విషయం కేంద్ర ప్రభుత్వానికి అసలు గుర్తుందో లేదో!

బీహార్, ఏపీ రాష్ట్రాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడం వెనుక గల రాజకీయ కారణాలు అందరికీ తెలిసిందే. అయితే ఇలా రాజకీయ కారణాల వల్ల కొన్ని రాష్ట్రాలకే నిధులు కేటాయించడం సబబు కాదు. ఇది దేశాభివృద్ధికి ప్రమాదకరం. కేంద్ర బడ్జెట్ అనేది దేశాభివృద్ధికి తోడ్పడేలా ఉండాలి. అంతేతప్ప ఏ ఒక్క ప్రాంత అభివృద్ధికో పరిమితం కాకూడదు.

ఏపీ విభజన చట్టం ప్రకారం.. ఏపీకి భారీగా నిధులు కేటాయించిన కేంద్రం తెలంగాణను విస్మరించడం శోచనీయం. విభజన చట్టం అంటే ఒక్క ఏపీకి సంబంధించినది కాదనే విషయం మరిచిపోకూడదు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, వెనుకబడిన జిల్లాలకు నిధులు లాంటి అనేక హామీలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. విభజన హామీలను నెరవేరుస్తారనే ఆశతోనే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లకు చెరో 8 ఎంపీ స్థానాలను తెలంగాణ ప్రజలు కట్టబెట్టారు. అయితే ఆ రెండు జాతీయ పార్టీలకు, ఆ పార్టీల ఎంపీలకు తెలంగాణ ప్రయోజనాలు పట్టవని బడ్జెట్‌ను చూస్తే అర్థమవుతున్నది. 'బడేభాయ్–ఛోటేభాయ్' అంటూ మాటిమాటికి ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్.. రిక్తహస్తాలతోనే వెనుదిరిగారనే విషయం కూడా స్పష్ట మవుతున్నది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్సే తెలంగాణ ప్రయోజనాలను కాపాడుతుం దని ప్రజలు ఇప్పటికైనా గ్రహించాలి.

**- ఎం.హనుమంతు,** 95057 76942




# రైతులందరికీ రుణమాఫీ అయ్యేనా?



**బి.నర్సన్**
94401 28169

**బ్యాంకుల్లో రూ.లక్షలోపు రుణాలున్న రైతులందరి ఖాతాల్లో మాఫీ సొమ్ము జమ చేశామని ఈ నెల 18న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కాంగ్రెస్ కార్యకర్తల రుణమాఫీ సంబురాలు కూడా అట్టహాసంగా జరిగాయి. అదే రోజు రైతు వేదికల వద్దనున్న రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి మాట్లాడారు. వారితో సంతోషాన్ని పంచుకున్నారు. అంతవరకు బాగానే ఉంది. కానీ, మరుసటి రోజు నుంచే తమకు మాఫీ సొమ్ములు రాలేదని లబోదిబోమంటూ అధికారుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ రైతులు తిరగడం మొదలైంది. మాఫీ లీలలు క్రమంగా బయటపడసాగాయి. కొందరు రైతులకు మొత్తానికే మాఫీ కాలేదు. మరికొందరికి సగం, అంతకన్నా తక్కువ సొమ్ము జమ అయింది. భార్యాభర్తల ఖాతాల్లో ఒకరికి వస్తే, ఇంకొకరికి రాలేదు. ఇలా మాఫీ సొమ్ము జమకాని ఖాతాల సమస్యలు అంతాఇంతా కాదు. ఇది సాంకేతిక లోపం వల్ల తలెత్తిన సమస్యా? లేదా ప్రభుత్వ విధివిధానాల మాయా? అనే విషయంపై స్పష్టత ఇచ్చేవారు రాష్ట్రంలో ఒక్కరూ లేరు.**

రైతులు ఆందోళన పడవద్దని చెప్తున్న వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రోజుకొక విధంగా మాట్లాడుతూ ఈ అంశాన్ని మరింత గందరగోళంలోకి నెట్టేస్తున్నారు. రేషన్ కార్డు లేనివారికి పట్టాదారు పాస్‌బుక్ ఆధారంగా మాఫీ అవుతుందని ప్రభుత్వం ప్రకటించింది. రేషన్‌కార్డులో కుటుంబ సభ్యుల వివరాలు ఉంటే.. పాస్‌బుక్‌లో భూ యజమాని పేరు మాత్రమే ఉంటుంది. ఈ రెండింటి మధ్య ఎలాంటి సమాచార సామ్యత లేదు. మాఫీ కాని రైతులు వ్యవసాయాధికారిని సంప్రదించాలని మంత్రి చెప్పారు. వ్యవసాయ పనులను వదిలేసుకొని ఆఫీసుల చుట్టూ తిరగాలని చెప్పడం తగదు. ప్రభుత్వ అధికారులే ఇంటింటికి తిరిగి రైతులకు స్పష్టమైన సమాచారమివ్వాలి. వాస్తవానికి ఏ అధికారి వద్ద మాఫీకి సంబంధించిన చిట్టా లేదు. సమగ్ర వివరాలు లేవు. అసలు అధికారులకు వాటిని ప్రభుత్వం అందించలేదు.

**మాఫీ వివరాలు తెలుసుకునేందుకు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి తెలుసుకోవచ్చని చెప్తున్నారు. కానీ, రైతులకు ఇది సాధ్యపడుతుందా? అయినప్పటికీ కొంతమంది ప్రయత్నించగా.. బ్యాంకు ఖాతా వివరాలు, రైతు పేరుతో సరిపోలడం లేదని, రేషన్‌కార్డులో పేరు లేదని.. ఇలా రకరకాల సమాధానాలు వస్తున్నాయి. ఆగస్టు 15 దాకా సమయం ఉన్నప్పటికీ ప్రభుత్వమే తొందరపడి తప్పులతడకగా మాఫీ చేసింది. దీంతో లక్షలాది మంది రైతులు మానసిక క్షోభకు గురవుతున్నారు.**




అసలు మొదట పైలట్ ప్రాజెక్టుగా ఒక గ్రామాన్నో లేదా మండలాన్నో ఎంపిక చేసుకొని రుణమాఫీ చేయాల్సింది. ఆ ప్రాంతంలోని రుణమాఫీ లబ్ధిదారులకు, బ్యాంకుల వద్ద ఉన్న పంట రుణాల వివరాలను పోల్చి చూసుకుంటే తప్పొప్పులు బయటపడేవి. వాటిని సరిచేసి తుది జాబితా తయారు చేసి ఉంటే ఎవరికీ ఇబ్బంది ఉండేది కాదు.

వాస్తవానికి జరిగిందేమిటంటే.. బ్యాంకుల హెడ్ ఆఫీసుల నుంచి కంప్యూటర్ ఇచ్చిన జాబితాలు తీసుకుని, ఆ పేర్లకు విధివిధానాల పేరిట తమ కోతల ప్రక్రియను జతచేశారు. ఆ మేరకు సొమ్మును బ్యాంకులకు ప్రభుత్వం అందించింది. బ్యాంకువారు ముంబై, చెన్నై తదితర మహానగరాల్లో ఉండే తమ కంప్యూటర్ సెంటర్ల ద్వారా వాటిని రన్ చేయించారు. వాటి ఫలితాలు బ్రాంచిల్లో ఉండే కంప్యూటర్లలో ప్రతిఫలించాయి. అప్పుడే బ్యాంకు ఖాతాల ద్వారా మాఫీ ఎవరెవరికి వచ్చిందనే విషయం బయటపడింది. ఎవరికి, ఎందుకు రాలేదో? పూర్తి సొమ్ము ఎందుకు జమ కాలేదో? చెప్పేందుకు బ్యాంకుల వద్ద సమాచారమే లేదు. వ్యవసాయ అధికారుల వద్ద కూడా లేదు. లబ్ధిదారుల జాబితాను తయారు చేసి బ్యాంకు హెడ్ ఆఫీసులకు పంపినవారికి మాత్రమే పాటించిన విధివిధానాల గురించి పూర్తిగా తెలుసు. ఈ జాబితా తయారీలో లోపం ఉందా? లేదా కొంత మందికే ప్రభుత్వం రుణమాఫీ చేయాలనుకున్నదా? అనేది వారే చెప్పాలి.

రైతుల ఆందోళనలు, నిరసనలు పత్రికల్లోకి ఎక్కాక అన్నదాతలను శాంతపరిచేందుకు మంత్రి తుమ్మల ప్రయత్నించారు. ఈ గందరగోళమంతా ఆధార్, బ్యాంక్ అకౌంట్, ఆర్బీఐ తప్పిదాల ఫలితమేనని సర్దిచెప్పారు. మాఫీ కాని రైతులకు 24 గంటల్లో అధికారులు వివరణ ఇస్తారని పేర్కొన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల 18 వేల ఖాతాల్లో రూ.85 కోట్లు జమ కాలేదని చెప్పుకొచ్చారు. ఒక కుటుంబంలో నలుగురు లబ్ధిదారులుంటే నలుగురికీ మాఫీ వర్తిస్తుందని, సెప్టెంబర్ ఆఖరులోగా రైతులందరి ఖాతాల్లో మాఫీ సొమ్ము జమ అవుతుందని వివరణ ఇచ్చారు. అయితే ప్రతి రైతుకు రుణమాఫీ వచ్చి తీరుతుందనే కచ్చితమైన మాట మాత్రం ఎవరి నోటా రావడం లేదు.

నిజానికి మంత్రికి బదులు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, ఈ మాఫీ నిర్వహణలో పాల్గొన్న ప్రధానాధికారులు ప్రజల ముందుకు, మీడియా ముందుకు వచ్చి మాట్లాడాలి. మాఫీ కాని రైతులతోనూ చర్చించాలి. ఎందుకు మాఫీ కాలేదో, అసలు అవుతుందో లేదో, కాకపోతే ఎందుకు కాదో ప్రతి రైతుకు స్పష్టం చేయాలి. ఈ ములాఖత్ వల్ల మాఫీ అందని మిగతా రైతులకు కూడా తమ పరిస్థితి అర్థమవుతుంది. అయితే ఎంపిక ప్రక్రియను విడమర్చి చెప్పేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నది. నూటికి నూరు శాతం మాఫీ చేసింది. 35 లక్షల రైతుల ఖాతాల్లో రూ.16,144 కోట్లను కేసీఆర్ సర్కార్ జమ చేసింది. అదేవిధంగా 2018లో 36.68 లక్షల రైతులకు రూ.లక్షలోపు రుణమాఫీ కోసం రూ.19,198 కోట్లు బ్యాంకులకు చెల్లించింది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్షలోపు రైతు రుణమాఫీ కోసం 11.5 లక్షల రైతులకు గానూ రూ.6,098 కోట్లు మాత్రమే జమచేసింది. ఈ సంఖ్య ఎందుకు తగ్గిందో, ఇంతటి వ్యత్యాసానికి కారణాలేమిటో స్పష్టమైతే ప్రభుత్వం బండారమంతా బయటపడుతుంది.